హింసను ప్రేరేపించడం అవివేకం

- క్రమశిక్షణ నేర్పిన అధినేత సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దాడులను తిప్పి కొట్టడం తమకు చేతకాక కాదని, తమ అధినేత కేసీఆర్ క్రమశిక్షణ, ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని నేర్పించారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు అయోమయస్థితిలో ఉండి వారి కార్యకర్తలను రెచ్చగొడుతున్నాయని ధ్వజమెత్తారు. హింసతో ఎవరు ఏమీ సాధించలేరని హితబోధ చేశారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి కోడి కత్తి డ్రామా అనడం సిగ్గు చేటని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. హింసతో ఓట్లు రాబట్టాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, వారికి సరైన గుణపాఠం నేర్పుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు నగేశ్, ఆదర్శ్ రెడ్డి, మిరాజ్ ఖాన్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవింద్, సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఐలేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

పటాన్‌చెరు: అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో బుధవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని కొడకంచి ఉపసర్పంచ్ అఖిలాష్‌గౌడ్, మాజీ సర్పంచ్ పెంటాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు తమ అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ శివరాజ్, పార్టీ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీపై దాడి హేయమైన చర్య

కంగ్టి(నారాయణఖేడ్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని, కాంగ్రెస్ హింసా రాజకీయాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. దాడికి పాల్పడిన ఆ పార్టీ కార్యకర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. నాయకులు బీంరా, సుక్కల్‌తీర్థ్, సిద్ధంగిర్గా, నాగుర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పతనం ఖాయం..

నారాయణఖేడ్: కాంగ్రెస్ హింసా రాజకీయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తనయుడు రోషన్‌రెడ్డి, సిర్గాపూర్ జెడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నిజాంపేట్ సర్పంచ్ జగన్‌చారి, నాయకులు అభిషేక్ షెట్కార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.


ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కఠినంగా శిక్షించాలి..

రామచంద్రపురం(పటాన్‌చెరు): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తకు తగిన శిక్ష విధించాలని కోరుతూ కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టౌన్ అధ్యక్షుడు గోవింద్, సర్కిల్ ప్రెసిడెంట్ పరమేష్, చాంద్‌,యాసిన్, కృష్ణ కాంత్, అంజాద్ పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో..


రామచంద్రాపురంలో..

క్లుప్తంగా

ఘనంగా ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు


ఎంపీ బీబీపాటిల్ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న నాయకులు, అభిమానులు

జహీరాబాద్: ఎంపీ బీబీపాటిల్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కేక్ కట్‌చేశారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, షేక్ ఫరీద్, లింగాయత్ సమాజ్ నాయకులు అరుణ్‌కుమార్, శివరాజ్, సంతోష్ పాటిల్, శివకుమార్ స్వామి, ప్రవీణ్ పాటిల్, కె.ఆనంద్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 13మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆరుగురికి జరిమానా

నారాయణఖేడ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి జరిమానా విధించారు. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ పట్టణంలోని జూకల్ శివార్లలో మద్యం తాగుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించామన్నారు. హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చర్యలు

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి హెచ్చరించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్‌లో స్వామి అనే వ్యక్తి బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించి రూ.3వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో...

అమీన్‌పూర్ మండల పరిధిలోని నరగ్రూడెంలో రాజీవ్ గృహకల్ప వద్ద ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ మల్లయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.8,100 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారి కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో స్టాటిక్ సర్వలెన్స్ టీమ్ సభ్యులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బుదేరా పోలీస్ సిబ్బంది హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాయికోడ్ మోడ్ వద్ద..

మనూరు(నారాయణఖేడ్): మండల కేంద్రమైన మనూరులోని మాయికోడ్ మోడ్ వద్ద ఎస్ఐ అమ్రనాయక్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ప్రజలు తనిఖీలకు సహకరించాలని కోరారు. తనిఖీలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నాయి.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


తడ్కల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేశం

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలంలోని తడ్కల్, కంగ్టి గ్రామాల్లో బుధవారం నారాయణఖేడ్ ఆర్డీఓ వెంకటేశం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ర్యాంప్, విద్యుత్, టాయిలెట్లు, తాగునీరు వంటి సదుపాయాలను పరిశీలించారు. తడ్కల్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు కంగ్టిలోని ఉన్నత పాఠశాలను పరిశీలించి సౌకర్యాల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీలు, బీఎల్ఓలను ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


వట్‌పల్లి: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ జోష్ అన్నారు. మండల పరిధిలోని మంచిర్యాల తండా, లక్యానాయక్, కర్మార్‌కంచ తండాలలో ఆరు గ్యారంటీ హామీలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివచరణ్, గోపాల్‌రెడ్డి, జిల్లా ఎన్ఎస్‌యుఐ నాయకులు వినయ్‌గౌడ్, అరవింద్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

హనుమంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో..

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని భోజ్యానాయక్ తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ అండగా నిలుస్తోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, తండా ఉపసర్పంచ్ సావిత్రిబాయిసుభాష్, నాయకులు రమేష్, శ్రీనివాస్, ధనరాజ్, సీతారాం, వకీల్ రవి, సచిన్, శ్రీను, బాలాజీ, అనిల్, వినోద్, గోవింద్, ప్రకాష్, శ్రవణ్, రహోల్, బబ్లు పాల్గొన్నారు.

చాల్కిలో కాంగ్రెస్ ప్రచారం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చాల్కి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెనిఫెస్టోలో పొందుపర్చిన అన్ని హామీలను అమలుచేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం చాల్కి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రశేఖర్ తరఫున ఆయన సతీమణి

జహీరాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ తరఫున ఆయన భార్య ప్రమీల పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపించడం తోనే సమస్యలు తీరుతాయన్నారు. చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖర్, నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన తండావాసులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- జోరుగా బీఆర్ఎస్ ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కంగ్టి మండలంలోని రాంతీర్థ్, నాగుర్(బీ), నాగుర్(కే), భీంరా, కంగ్టి, ముకుందతండా, నాగుర్‌తండా, రాంతీర్థ్‌తండా, దెగుల్వాడి, తండా, చౌకన్‌పల్లి, జీర్గితండా, సర్దార్ తండా, ఎడ్లరేగడితండాల్లో ఎన్నికల నేపథ్యంలో బుధవారం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు గంగారాం, నాయకులు వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అండగా నిలవండి

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా నిలవాలని వరము చైర్మన్ వీరారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునూర్, పాలాదుగు గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధు, నాయకులు బస్వరాజ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

మునిపల్లి(అందోల్): ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లాపూర్, హైద్లాపూర్, తక్కడపల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మంగంపేట, ఊట్ల, జిన్నారం, అండూర్, గుమ్మడిదల మండలంలోని కానుకుంట, రాంరెడ్డిబాయి, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, కుమారుడు విక్రంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు వెంకటేశంగౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డిని ప్రశ్నించాలి

సదాశివపేట(సంగారెడ్డి): ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పిన ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ప్రజలు నిలదీయాలని సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడూరు రమేష్ పిలుపునిచ్చారు. సదాశివపేటలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్రమోహన్‌గౌడ్, చౌదరిప్రకాష్, గుండు రవి, పిల్లోడి విశ్వనాథం, ఆకుల శివకుమార్, శ్రీనివాస్, నల్ల శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలో...

జహీరాబాద్: పట్టణంలోని భరత్‌నగర్, మండలంలోని అర్జున్ నాయక్ తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు ఉమాకాంత్‌పాటిల్, మంకాల్ సుభాష్, వెంకటేశం, సుభాష్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


జిన్నారం: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, నాయకులు


మునిపల్లి: అల్లాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిధిలోని అబ్బెందలో బుధవారం బహుజన్‌ముక్తి పార్టీ అభ్యర్థి ప్రకాష్ రాథోడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు గ్రామస్తులకు వివరించారు. పేదల సంక్షేమం బీఎంపీతోనే సాధ్యమన్నారు. మంచం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. నాయకులు సురేష్ నాయక్, రాథోడ్ సురేష్, శ్రీనివాస్‌నాయక్, వినోద్, సుభాష్, రమేష్, మోహన్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బీఎంపీ అభ్యర్థి ప్రకాష్‌రాథోడ్, నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు

పటాన్‌చెరు టౌన్: పూజాసామగ్రి దుకాణంలోకి చొరబడి చోరీకి పాల్పడిన వ్యక్తిని దేవస్థానం సెక్యూరిటీ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారంలో చోటుచేసుకుంది. స్థానికులు, ఆలయ సెక్యూరిటీ తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ దేవస్థాన సమీపంలో ఉన్న పూజ సామగ్రి దుకాణం షట్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి తెరిచి అందులో నగదును ఎత్తుకొని పరారీ అవుతున్న క్రమంలో ఆలయ సెక్యూరిటీ పట్టుకుని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నర్సాపూర్ సిద్ధరామ్‌పూర్ కాలనీకి చెందిన వడ్డే కుమార్‌గా గుర్తించారు.

◆ మహాపాదయాత్ర ప్రారంభం

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని నవరత్నాలయ దేవస్థానం నుంచి శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం వరకు చేపట్టిన రెండో మహాపాదయాత్రను బుధవారం ప్రారంభించారు. పాదయాత్రకు సీతారామ శివాంజనేయ స్వామి దేవాలయం వద్ద జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి స్వాగతం పలికారు. 41 రోజుల తర్వాత శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయానికి చేరుకుంటామని సాహితీ రామ గురుస్వామి తెలిపారు. రాముగురుస్వామి సంగారెడ్డి, సదాశివపేట గురుస్వాములు పాల్గొన్నారు.


శబరిమల మహాపాదయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

◆ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జహీరాబాద్: పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అల్లీపూర్ దర్గా వద్ద నుంచి బీదర్ క్రాస్ రోడ్డు వరకు పట్టణమంతా విద్యుత్ సరఫరా ఉండబోదని తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

- మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు


బీఆర్ఎస్ కండువా వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్‌లో బుధవారం రెండో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, సాధువు మల్లేష్ సీనియర్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, గోపాల్, చంద్రశేఖర్, మ్యకం మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్ సమక్షంలో..

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన 100 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రభుత్వ మెరుగైన పాలనను చూసే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, వార్డుసభ్యులు వీరారెడ్డి, నాయకులు నర్సింహులు, వెల్టూరు సర్పంచ్ లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బేగరి సుధాకర్, సుజాత, అమృతమ్మ పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలతో చింతా ప్రభాకర్

రీఫిల్లింగ్ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లను మీడియాకు చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగిలో అక్రమ నిర్వహిస్తున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై బుధవారం రాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో భారీ మొత్తంలో సిలిండర్లను పట్టుకున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం వారిగంతం గ్రామానికి చెందిన మధిర రవీందర్, మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఉపసాల గోపాలకృష్ణ అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారు. వారి నుంచి 100 చిన్న సిలిండర్లు, 37 కమర్షియల్, 13 కమర్షియల్ ఫుల్ సిలిండర్లు, ఆరు డొమెస్టిక్ ఖాళీ, మూడు డొమెస్టిక్ ఫుల్ సిలిండర్లను, రెండు వేయింగ్ మిషన్లు, రెండు రీఫిల్లింగ్ పైపులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పటాన్‌చెరు పోలీసులకు అప్పగించారు. నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

16 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చిందని వైద్యులు తెలిపారు.

ఆర్థికసాయం

పటాన్‌చెరు: కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన శ్రీనివాస్ కుటుంబం కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అశోక్‌నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీరాంనగర్ కాలనీ మాజీ వార్డ్‌మెంబర్ వీరారెడ్డి, రామ్మోహన్, రాయలసీమ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లగా అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు.